విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తాళ్లరేవు: మండల పరిధిలోని జి.వేమవరం గ్రామానికి చెందిన పుణ్యమంతుల గోవిందరాజు(65) గురువారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గోవిందరాజు తన ఇంటి వెనుక ఉన్న బాత్రూంకి వెళుతుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



మృతి చెందిన గోవిందరాజు

ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

- బాలయోగి స్టేడియంలో భారీ సభ
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రాయితీ జమ

అమలాపురం రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా అమలాపురం రానున్న నేపథ్యంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ రాయితీ నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేయనున్నారు. మహిళల కోసం ప్రత్యేక గ్యాలరీలు, మహిళా సంఘాల ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను సిద్ధం చేశారు. పట్టనంలోని ఎన్టీఆర్ మార్గ్ నుంచి బాలయోగి స్టేడియం వరకూ భారీగా కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం పలకనున్నారు. సభలో అమలాపురం నియోజకవర్గానికి సంబంధించి 6,010 మహిళా సంఘాలకు గాను రూ.8.04 కోట్ల సున్నా వడ్డీ రాయితీ నిధులను జమ చేయనున్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ పట్టణంలో కటౌట్లతో చేసిన ఏర్పాట్లు

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయండి

అల్లవరం: స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ రాయితీ పంపిణీ సందర్భంగా శుక్రవారం అమలాపురం బాలయోగి స్టేడియానికి వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటను విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి పర్యటనపై సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని, బహిరంగ సభకు వస్తున్న మహిళలకు భోజనాలు, తాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఎంపీఎం సయ్యద్, విస్తరణాధికారి లక్ష్మణరావు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

మంత్రిని కలిసిన యువజన విభాగ అధ్యక్షుడు

ఉప్పలగుప్తం: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఇటీవల వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగ అధ్యక్షుడిగా నియమితులైన ఓగూరి విజయ కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మంత్రికి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, పెయ్యిల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, కొంకి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి విశ్వరూప్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న విజయ్‌కుమార్

13న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు సన్మానం

అమలాపురం రూరల్: ఈ నెల 13న నడిపూడిలోని బాబూ జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాలులో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను సత్కరించనున్నట్లు మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు గురువారం తెలిపారు.



మాతాశిశు మరణాల రేటు తగ్గించాలి

జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: రక్త హీనత, పౌష్టికాహార లోపాలను సరిదిద్ది మాతాశిశు మరణాల రేటును తగ్గించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ వ్యాధుల కట్టడిలో భాగంగా సార్వత్రిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మధుమేహం, రక్తపోటుతో సహా పలు రకాల కేసులను, స్క్రీనింగ్ పరీక్షలను ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి త్వరగా పూర్తి చేయాలన్నారు. పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలను 100 శాతం పూర్తి చేసేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.దుర్గారావుదొర, సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వరరావు, డీఈవో ఎం.కమలకుమారి, డీపీవో వి.కృష్ణకుమారి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికార అధికారి జీవీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నుపూర్ అజయ్

ఓఎన్‌జీసీ ద్వారా వేట నిషేధ పరిహారం ఇవ్వాలి

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్

యానాం: ఓఎన్‌జీసీ సంస్థ ద్వారా రెండో విడత వేట నిషేధ పరిహారాన్ని మత్స్యకారులకు జమ చేయాలని పుదుచ్చేరి మంత్రి లక్ష్మీనారాయణకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన కార్యాలయంలో వేటనిషేధ పరిహారం మంజూరు గురించి చర్చించారు. యానాంలో ఉన్న మత్స్యకారులకు అందాల్సిన నష్టపరిహారం అర్హులందరికీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఇప్పటికే నష్ట పరిహారం అందజేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం రంగసామికి సైతం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కొంతమంది కొన్ని సేవాసంస్థల పేరుతో తమ ఖాతాల్లో సొమ్ము జమ చేయమని ఓఎన్‌జీసీ సంస్థ అధికారుల్ని మభ్యమట్టే ప్రయత్నం చేశారన్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో తప్ప ఎవరి ఖాతాల్లోనూ ఒక్క రూపాయి కూడా జమ చేయకూడదని కోరారు.



మత్స్యకారుల వేట నిషేధ పరిహారంపై మంత్రి లక్ష్మీనారాయణతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్





